క్లుప్తంగా

గ్రంథాలయాల అభివృద్ధికి సహకారం అందించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయ అభివృద్ధికి అందరూ సహాయ, సహకారాలు అందించాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. బందరు లాకుల సమీపంలోని రామ్మోహన గ్రంథాలయంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రంలో బుధవారం గ్రంథాలయ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు మాట్లాడుతూ పుర ప్రముఖులు, సాహిత్యాభిలాషులు గ్రంథాలయాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేయాలన్నారు. డాక్టర్ జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ రామ్మోహన గ్రంథాలయ చరిత్ర, ప్రాముఖ్యతను వివరించారు. కార్యదర్శి వేములపల్లి కేశవరావు మాట్లాడుతూ రామ్మోహన గ్రంథాలయ కార్యక్రమాలు, కార్యచరణ గురించి వివరించారు. అనంతరం అటల్ బిహారీ వాజ్ పేయి విజ్ఞాన కేంద్రంలోని చిత్రపటాలను గీసిన కమిటీ సభ్యులు పావులూరు చిదంబరేశ్వరరావును సత్కరించారు. గ్రంథాలయ కమిటీ వెంకయ్యానాయుడును ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కామినేని శ్రీనివాస్, గ్రంథాలయ ఉపకార్యదర్శి తంగిరాల రఘురాం, గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు పాల్గొన్నారు.

13న స్వాతంత్య్ర ఉద్యమ శంఖారావం




కృష్ణలంక(విజయవాడతూర్పు): 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్వాతంత్య్ర ఉద్యమ శంఖారావం నిర్వహిస్తున్నట్లు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా శంఖారావం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ.. జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 450 మంది విద్యార్థిని విద్యార్థులతో కళారూపాలు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ అధ్యక్షులు సునీల్ కుమార్, అరసవల్లి గిరిధర్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, పి.ఐజాక్ నూటన్, చంద్రిక, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకు అంగీకారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదరిక నిర్మూలనకు రాష్ట్రప్రభుత్వం వినూత్నంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమంలో మార్గదర్శిగా ఉండేందుకు అమరావతి ఐ హాస్పిటల్ ముందుకు వచ్చింది. ఈ మేరకు అమరావతి ఐ హాస్పిటల్ ఎండీ డాక్టర్ శైలజ కేతినేని కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను బుధవారం కలిశారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా నిలిచి.. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తామంటూ కలెక్టర్‌కు ప్రతిజ్ఞా పత్రాన్ని అందజేయగా, అమరావతి ఐ హాస్పిటల్ యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అమరావతి ఐ హాస్పిటల్ బ్రాంచ్ హెడ్ పి.కోటిరత్నం పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో అనేక అనర్థాలు



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడి బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకోవద్దని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక సూచించారు. పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుర్వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జె.సంధ్యమాధురి మాట్లాడుతూ ప్రతిఒక్కరు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్.దేవమణి, అధ్యాపకులు కె.బాలరాజు, వి.సర్వారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయకుండా మోసం

సీఎం చంద్రబాబుపై మల్లాది మండిపాటు



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా.. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు మండిపడ్డారు. స్థాక 36వ డివిజన్ సీతన్నపేటలో బుధవారం సాయంత్రం రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ఈ ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కారణంగా డివిజన్‌వాసులకు అక్షరాలా రూ.4 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు.

ప్రజల తరపున పోరాటం..

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే విష్ణు సూచించారు. ఆయా సమస్యలపై ప్రజల తరపున పోరాటం చేస్తూ ప్రతిపక్షపాత్రను సమర్థవంతంగా పోషించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటాల కారణంగానే ఒకటీఅర పథకాలు అమలుచేస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలతోపాటు సూపర్‌సిక్స్ పథకాలను ఇస్తామన్న హామీని ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

నాడు డీబీటీ ద్వారా రూ.21.43కోట్లు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో డివిజన్‌లోని 6738మందికి డీబీటీ ద్వారా రూ.21.43కోట్లను అందజేసినట్లు గుర్తుచేశారు.తమహయాంలో డివిజన్‌లో రోడ్లు, మౌలికసదుపాయాలకు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. డివిజన్‌లో ప్రజలందరికీ ఉపయోగపడేలా రైతుబజార్‌ను ఉద్యానవనంను ఏర్పాటు చేశామని వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో టీడీపీ నేతలు ప్రజలలోకి వెళ్లేందుకు జంకుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని 8వేలమందికి అమరావతిలో ఇంటిస్థలం ఇస్తే, ఆ స్థలాలను రద్దుచేయడం ద్వారా కూటమి ప్రభుత్వం పేదల సొంతింటి కలను దూరం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పేదల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నాయకులను నిలదీయాలి..

పేదలను పట్టించుకోని సీఎం చంద్రబాబు నగరంలోని అత్యంత విలువైన భూమిని లూలూ సంస్థకు 99ఏళ్లపాటు లీజుకు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ పక్కన పేదలు ఉంటే తరిమికొట్టే చంద్రబాబు ప్రభుత్వం, పెత్తందారులకు మాత్రం విలువైన స్థలాలను కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలుచేయని ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలు నిలదీయాలని మల్లాది విష్ణు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు పిల్లుట్ల వంశీ, పులపా కృష్ణ, తాడి శివ, భూపతిరెడ్డి, పప్పుల శివ, దాలి నాయుడు, వి.రామారావు, కె.కృష్ణ, పి.దుర్గారావు, కాలే పుల్లారావు, వీరయ్య, డి.రాంబాబు, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటిసరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో నీటి వనరులు, తాగునీటి సరఫరా వ్యవస్థలపై చర్చించి, గుర్తించిన సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచినీటిని సరఫరా చేయడంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇందుకు క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని మొత్తం 20 సీపీడబ్ల్యూ పథకాల ద్వారా మంచినీటి సరఫరాలో సమస్యలు ఎదురుకాకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ఎం) పెండింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయడం, బిల్లుల చెల్లింపులు, అవసరమైన మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు వంటివి లేకుండా చూడటం, పంపు హౌస్, మోటార్లు సక్రమంగా పనిచేసేలా చూడటం తదితర పనులపై క్షేత్రస్థాయిలో నిరంతర సమీక్షలు అవసరమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటిసరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, డీఈ వి.రవికుమార్, ఏఈ దయానంద్, కాంట్రాక్టర్ వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

కాలనీలు 50శాతం భాగస్వామ్యంతో ఎంఓయూ చేసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కాలనీలు 50 శాతం భాగస్వామ్యంతో వీఎంసీతో ఎంఓయూ చేసుకోవాలని వీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ అర్జునరావు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ ఆవరణలోని నూతన భవనంలో గల సమావేశం హాల్‌లో డాక్టర్ అర్జునరావు నగరంలోని వివిధ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హోటల్స్, స్కూల్స్, హాస్పిటల్స్, రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లు, చికెన్-మటన్ స్టాల్స్ యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలకు అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది జీతం 50 శాతం నగరపాలక సంస్థ, మిగిలిన 50 శాతం కాలనీలు చెల్లించే విధంగా ఎంఓయూ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నగరంలో నాలుగు కాలనీలతో వీఎంసీ ఎంఓయూ చేసుకుందని, మిగిలిన కాలనీలు కూడా అదే విధంగా ఎంఓయూ చేసుకోవాలని చెప్పారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించాలి..

నగరంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ప్రకారం 2022లో ఇచ్చిన అమెండ్‌మెంట్స్ మేరకు ప్రతి వ్యాపార సంస్థ, ప్రజలు అమలు చేయాలని డాక్టర్ అర్జునరావు అన్నారు. దానిలో భాగంగా 120 మైక్రాన్లకన్నా తక్కువ పరిమాణం గల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం/అమ్మకం నిషేధించాలని తెలిపారు. గత 10 రోజుల్లో నిర్వహించిన తనిఖీల్లో 1371.68 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి రూ.7,41,600లు జరిమానా విధించామన్నారు. ఈ నెల 15 నాటికి నగరంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబూ శ్రీనివాస్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అర్జునరావు

• ఫ్లవర్ మార్కెట్.. ఫుల్ రష్



శ్రావణ శుక్రవారంతోపాటు వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని పూల మార్కెట్‌లో బుధవారం ఫుల్ రష్ నెలకొంది. మున్సిపల్ కార్యాలయం రోడ్డుతోపాటు ఫ్లవర్ మార్కెట్ పరిసరాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నేడు దసరా ఉత్సవాలపై సమీక్ష సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ అధికారులు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని మహా మండపం నాల్గో అంతస్తులో నిర్వహించే సమీక్ష సమావేశానికి దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దసరా ఉత్సవాలకు ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమితులైన పూర్వ ఈవో భ్రమరాంబతో పాటు దుర్గగుడి దేవస్థానానికి చెందిన ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులతో పాటు దేవదాయ శాఖ, ఇతర ముఖ్య అధికారులు హాజరుకానున్నారు. ఈ ఏడాది సింహాచలం దేవస్థానంలో చందనోత్సవ సమయంలో గోడ కూలిన ఘటన, గత నెల సింహాచలం గిరి ప్రదక్షిణ నేపథ్యంలో షెడ్డు కూలిన క్రమంలో దసరా ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేసేలా చర్చించనున్నారు. దసరా ఉత్సవాల పనులపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయడంతో పాటు పనుల పురోగతి, నాణ్యత వంటి అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని దేవదాయ శాఖ మంత్రి ఇప్పటికే ఆలయ అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం జరిగే సమీక్ష సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ మేరకు దరఖాస్తు చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవో నంబర్ 134 మేరకు అనధికార లే-అవుట్లు ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ని పొడిగించి సవరణ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 30లోపు వేసిన అనధికారిక లే అవుట్లు, ప్లాట్లు నిర్ణీత జరిమానాతో, 14 శాతం ఓపెన్‌స్పేస్ చార్జెస్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://ఎల్ఆర్ఎస్‌టీడీసీపీడాట్ఏపీడాట్‌జీవోవీడాట్ఇన్/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను వీఎంసీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మిగిలిన 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించవచ్చన్నారు. 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జిలలో 50 శాతం రాయితీ సెప్టెంబర్ 10లోపు చేసుకుంటే వారికి పీనలైజేషన్ చార్జీలలో 10 శాతం వస్తుందన్నారు. అక్టోబర్ 24వ తేదీలోపు చెల్లించిన వారికి పీనలైజేషన్‌లో 5 శాతం మాత్రమే రాయితీ వస్తుందని వారికి రైల్వే/రక్షణ శాఖల మార్గదర్శకాలలో పేర్కొన్న షరతులకు లోబడి ఉన్నవారికి అబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం లేదని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఇతర వివరాలకు వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర(ఫైల్)

సమాజాభివృద్ధే లక్ష్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజాభివృద్ధే ధ్యేయంగా తమ అసోసియేషన్ పని చేస్తోందని ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జయప్రకాష్ నారాయణ చౌదరి అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం సున్నపుబట్టీల సెంటర్‌లోని అసోసియేషన్ హాలులో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ చౌదరి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ప్రారంభం నాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఆటో యజమానులు, డ్రైవర్లకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడంతో పాటు వారి పిల్లల విద్యను అభ్యసించేందుకు ఉపకార వేతనాలు కూడా అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది 87 మంది విద్యార్థులకు 4 లక్షల 35 వేల రూపాయలను ఉపకార వేతనాలుగా అందించామని చెప్పారు. వరదల సమయంలో వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు, వరద బాధితుల సహాయ నిధికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5 లక్షల చెక్కును ఇచ్చామన్నారు. అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు పీఎస్‌వీ.ప్రసాదరావు, అసోసియేషన్ కార్యదర్శి వల్లూరి నాగార్జున, కోశాధికారి తిరువీధి హరికృష్ణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు అందజేస్తున్న నిర్వాహకులు

9నుంచి జైసంతోషిమాత ఉత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం జైసంతోషిమాత ఆలయంలో ఈనెల 9వ తేదీ నుంచి 11వతేదీ వరకు అమ్మవారి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చిన్ని చిట్టిబాబు తెలిపారు. ఆ లయం ప్రాంగణంలో బుధవారం జయంతి ఉత్స వాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ 9వ తేదీ ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అమ్మ వారి విశేషాలంకరణ, శ్రీలక్ష్మీ గణపతిహోమం, కుంకుమపూజ, మహానైవేద్యం, 10వ తేదీ అమ్మవారి రథోత్సవం, మేళతాళాలతో గ్రామ ఉరేగింపు, 11వ తేదీన విశేషాలంకరణ, విశేషపూజలు, మహాఅన్నప్రసాదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీసాయి హృదయ కళానాట్యమండలి, జైసంతోషిమాత కళా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో తొలి రోజున మోహిని భస్మాసుర చరిత్ర, రెండోరోజు పంచరత్నాలు, మూడోరోజు సత్యహరిచంద్ర నాటకం ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు హాజరుకావాలని కోరారు.

కార్యక్రమంలో ఆలయఅభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీమంద్రి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు అగురు త్రినాథ్, గంటయ్య, బోణం నాగాంజనేయరావు, గంగాధరరావు, మార్కండేయులు, దామోదరావు, సుభాషిణి పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కృష్ణాజలాలకు బదులు బోరు నీరే సరఫరా!

- తాగునీటి ఇబ్బందుల్లో విలేజీ కండ్రిక వాసులు..
- పట్టించుకోని వీఎంసీ అధికారులు


పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరానికి శివారున ఉన్న 64వ డివిజన్లోని విలేజీ కండ్రిక ప్రజానీకం మంచినీటి కోసం తీవ్ర అవస్థలుపడుతున్నారు. విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు విలేజీ కండ్రిక ప్రాంతవాసులకు కృష్ణానది నీటికి బదులుగా స్థానిక బోర్ల నీటితో ట్యాంక్ నింపుతూ ప్రజలకు సరఫరా చేస్తుండటంతో ఆనీటిని తాగలేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.

నీటి పన్నుగా రూ.12లక్షలు వసూలు..

విలేజీ కండ్రిక ప్రజలకు నగరపాలక సంస్థ మంచినీరుగా కేవలం పది నుంచి 20 నిమిషాలపాటు మాత్రమే కృష్ణాజలాలను సరఫరా చేస్తోంది. మిగిలిన సమయమంతా బోరునీటిని సరఫరా చేస్తూ.. నీటి పన్ను మాత్రం కృష్ణానది నీటి మాదిరి వసూలు చేస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. నగరపాలకసంస్థ అధికారులు విలేజి కండ్రికలో ఏడాదికి నీటి పన్ను కింద ప్రజల నుంచి రూ.12లక్షలు వసూలు చేస్తున్నారు. స్థానిక బోర్ల నుంచి సరఫరా చేసే నీరు కూడా పల్లపు ప్రాంతాలకు మినహా, మెరక ప్రాంతంలో నివాసం ఉండే వారికి అందడం లేదు. ఈ బోరు నీటిని తాగలేక ఆర్వోప్లాంట్ల నుంచి 20లీటర్ల క్యాన్‌ను రూ.20పెట్టి కొనుగోలు చేయక తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. విలేజి కండ్రికలోని అన్ని ప్రాంతాలకు కృష్ణానది నీటిని తాగునీటిగా సరఫరా చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోకపోవడం తమపాలిట శాపంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శివారు ప్రాంత ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

వీధి కుళాయిలు కూడా లేవు..

విలేజీ కండ్రికలో విజయవాడ నగరపాలక సంస్థ 12ఏళ్ల కిందట ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించింది. అయితే పుష్కరకాలంగా వీధి కుళాయిలను మాత్రం ఏర్పాటు చేయలేదు. ఇళ్లలో కుళాయిలు ఉన్నవారు మాత్రమే ట్యాంకు నుంచి వచ్చే నీటిని పట్టుకుంటుండగా, కుళాయి కనెక్షన్ లేని వారు మరింత ఇబ్బందులుపడుతున్నారు. వీధి కుళాయిలు లేకపోవడంతో ఎండాకాలంలో బాటసారులు కనీసం గొంతుతడుపుకునేందుకు సైతం అవకాశం లేకుండాపోయింది. ఇకనైనా నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు స్పందించి విలేజీ కండ్రికలో వీధి కుళాయిలు ఏర్పాటు చేయడంతోపాటు మంచినీరుగా కృష్ణాజలాలను సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విలేజీ కండ్రికలో వీఎంసీ వాటర్ ట్యాంక్

కృష్ణానీటిని సరఫరా చేయాలి..

గ్రామంలోని బోర్ల నీటిని సరఫరా చేస్తుండటంతో తాగలేక ఇబ్బందిపడుతున్నాం. కండ్రిక, విలేజీ కండ్రికకు తాగునీరుగా విజయవాడ నగరంలో మాదిరిగా కృష్ణానది నీటిని సరఫరా చేయాలి.

– బి.భవాని



వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలి..

కండ్రిక, విలేజీ కండ్రికలో వీధికుళాయిలు లేవు. దీంతో ఇళ్లలో కుళాయి కనెక్షన్ లేనివాళ్లు ఇబ్బందిపడుతున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలి.

– కె.ఈశ్వరమ్మ



ఉద్యానవనం పనులకు శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ ట్రెండ్‌సెట్‌లో రూ. 40లక్షల వ్యయంతో నిర్మించనున్న ఉద్యానవనానికి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రెండ్‌సెట్‌లో ఏ సమస్య వచ్చినా తాను పరిష్కరిస్తానని ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరలో ఉద్యానవనం పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. స్థానిక పెద్దలు, ట్రెండ్‌సెట్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): కొబ్బరి చెట్టుపై నుంచి పడటంతో గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు..వైఎస్సార్‌కాలనీకి చెందిన కడిమి కృష్ణ(40)గత నెల 26వ తేదీన రవీంద్ర ఫంక్షన్ హాలు వద్ద కొబ్బరిమట్టల కోసం కొబ్బరి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈఘటనలో తీవ్రగాయాలపాలైన అతన్ని కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా, చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తమ్ముడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.